

మెదక్‌లో భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ, చిత్రంలో కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే రోహిత్‌రావు

## మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఆపదలో ఉన్న మహిళలకు భరోసా కేంద్రం అండ
- వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- మెదక్‌లో భరోసా సెంటర్, షీటీమ్ నూతన భవనం ప్రారంభోత్సవం

మెదక్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని.. టీజింగ్, లైంగిక వేధింపులు, అత్తింటివారి ఆగడాలకు గురైన మహిళలు, అమ్మాయిలు, పిల్లలకు రక్షణగా భరోసా కేంద్రం నిలుస్తుందని వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం మెదక్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ రాజర్షి షా, స్థానిక ఎమ్మెల్యే రోహిత్‌రావుతో కలిసి రూ.2 కోట్లతో నిర్మించిన భరోసా కేంద్రాన్ని, షీ టీమ్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భరోసా కేంద్రానికి వచ్చే బాధిత మహిళలు రాత్రి వేళలో ఉండేందుకు, కౌన్సెలింగ్, న్యాయ సాయం కోసం అవసరమైన అన్ని వసతులు కల్పిస్తూ ఆధునిక హంగులతో నూతన భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. జిల్లాలో 2022 ఆగస్టు నుంచి ఇప్పటి వరకు 135 కేసులు నమోదయ్యాయని, బాధితులకు సుమారు 27 లక్షల పైచిలుకు ఆర్థిక సాయం చేశామన్నారు. వివిధ సమస్యలతో వచ్చిన బాధితులకు అండగా, పోక్సో కేసుల్లో మహిళలు, చిన్నారులకు సాంత్వన చేకూర్చడానికి, కౌన్సెలింగ్, రిహాబిలేషన్ సెంటర్‌గా భరోసా కేంద్రం దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా భరోసా కేంద్రంలో మంత్రి మొక్కను నాటారు. కార్యక్రమంలో డీఐజీ రెమా రాజేశ్వరి, ఎస్పీ బాలస్వామి, డీఎంఅండ్‌హెచ్‌వో చందూ నాయక్, జిల్లా సంక్షేమాధికారిణి బ్రహ్మాజీ, మెదక్ తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## దుబ్బాకను డివిజన్‌గా ప్రకటించాలి


- ప్రొటోకాల్ పాటించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- నియోజకవర్గానికి మంజూరైన నిధులు విడుదల చేయాలి
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- శాసనసభ సమావేశాల్లో తొలి ప్రసంగం



దుబ్బాక, ఫిబ్రవరి 15: దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి శాసనసభలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం శాసనసభ సమావేశాల్లో భాగంగా తొలిసారి ఆయన మాట్లాడారు. దుబ్బాకను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ చాలా రోజుల నుంచి ఉందన్నారు. నియోజకవర్గంలో ఉన్న 8 మండలాలు రెండు (సిద్దిపేట, మెదక్) జిల్లాల్లో, మూడు డివిజన్‌లలో సిద్దిపేట, గజ్వేల్, మెదక్ పరిధిలో ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో పాటు పాలనాపరమైన సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం స్పందించి తక్షణమే దుబ్బాకను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలన్నారు. పట్టణానికి రింగ్‌రోడ్డుతో పాటు వివిధ అభివృద్ధి పనుల గురించి ప్రస్తావించారు. దుబ్బాక మున్సిపాలిటీకి గత ప్రభుత్వంలో మంజూరైన నిధులను ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు వెనక్కి తీసుకుందని, ఆ నిధులను వెంటనే విడుదల చేసి పనులను ప్రారంభించాలని కోరారు. ప్రొటోకాల్, అభివృద్ధి పనులపై ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులకు విన్నవించినట్లు గుర్తుచేశారు. దుబ్బాకలో ఓ కాంగ్రెస్ నాయకుడు ఇష్టారీతిలో ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడని, అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రొసీడింగ్‌లు అందిస్తానని హంగూఆర్భాటాలు చేస్తున్నాడని ఆరోపించారు. దీంతో ప్రజలు అయోమయానిగి గురవుతున్నారన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో దుబ్బాకలో బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావును ప్రొటోకాల్‌తో గౌరవించామని గుర్తు చేశారు.

### మాజీ సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు

దుబ్బాక ఎమ్మెల్యేగా శాసనసభలో అడుగుపెట్టే అవకాశం కల్పించిన మాజీ సీఎం , బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు, నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ఏర్పాటుతో పాటు గత పదేండ్లలో తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని అన్నారు.




# కమలంలో కల్లోలం

## ఎంపీ ఎన్నికల ముందు రాజీనామాల పర్వం

- బీజేపీని వీడుతున్న ముఖ్య నేతలు..
- ఇప్పటికే బాబూమోహన్, రాంచందర్ రాజీనామా
- త్వరలో అదే బాటలో మరికొంత మంది నాయకులు?

సంగారెడ్డి, ఫిబ్రవరి 15(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో 'కమలం' వాడిపోతున్నది. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఒక్కో ముఖ్య నేత బీజేపీని వీడుతుండడం ఆ పార్టీ నేతలు, అధిష్టానాన్ని కలవరపెడుతున్నది. మోదీ చరిష్మాతో ఉమ్మడి జిల్లాలోని మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకుంటామని బీజేపీ ధీమాగా ఉన్నది. ఇలాంటి తరుణంలో పార్టీకి ముఖ్యనేతలు రాజీనామా చేస్తూ పార్టీ నుంచి వైదొలుగుతున్నారు. మరోవైపు సంగారెడ్డి జిల్లా బీజేపీలో గ్రూపు తగాదాలు పెరుగుతుండటం అధిష్టానానికి తలనొప్పిగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆందోల్ ఎమ్మెల్యే టికెట్ కేటాయింపులో తాత్సారం చేయటంతో ఎన్నికలకు ముందే పార్టీని వీడాలని బాబూమోహన్ భావించారు. తనకు టికెట్ ఇవ్వకపోవడంపై ఆయన అధిష్టానం తీరును ఎండగట్టడంతో ఎట్టకేలకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చింది. ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఓడిపోవడంతో పార్టీలో ఇమడలేక ఇటీవలే బీజేపీకి రాజీనామా చేశారు. తాజాగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సోదరుడు రాంచందర్ రాజనర్సింహ కమలంను వీడారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆయన బీజేపీలో చేరారు. ఎస్సీ రిజర్వుడు స్థానమైన జహీరాబాద్ నుంచి ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. దీంతో వ్యక్తిగత కారణాలతో పార్టీకి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు రాంచందర్ సోమవారం ప్రకటించారు. ఈ మేరకు రాజీనామా లేఖను రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి అందజేశారు. సంగారెడ్డి జిల్లాలో బీజేపీ తరపున పోటీచేసిన ఇద్దరు ఎమ్మెల్యే అభ్యర్థులు పార్టీని వీడటం ఆ పార్టీలో కలకలం రేపుతున్నది. పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఇద్దరు ముఖ్యనాయకులు బీజేపీని వదలడంతో పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందేమోనని అధిష్టానం కలవరపడుతుంది. ఇదిలాఉంటే ఎంపీ టికెట్ కోసం పోటీ పడుతున్న మరో ఇద్దరు నేతలు సైతం త్వరలో పార్టీని వీడుతారని జోరుగా ప్రచారం జరుగుతుంది. తమకు టికెట్ దక్కని పక్షంలో ఆలోచించి నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

### ఆ మూడు నియోజకవర్గాల ముఖ్య నాయకులు కూడా..

పటాన్‌చెరు, సంగారెడ్డి, నారాయణఖేడ్ నియోజకవర్గాల్లోని ముఖ్యనాయకులు కూడా పార్టీకి గుడ్ బై చెప్పే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదే జరిగితే బీజేపీకి కోలుకోలేని దెబ్బ తగిలే అవకాశం ఉంది. ఓవైపు ముఖ్య నాయకులు పార్టీలోంచి వెళ్తుంటే, మరోవైపు జిల్లా బీజేపీలో అంతర్గత విభేదాలు అధిష్టానాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డికి పదవి దక్కటంతో అసంతృప్తితో ఉన్న కొందరు నాయకులు ఆమెకు వ్యతిరేకంగా పావులు కదుపుతున్నారు. గోదావరి అంజిరెడ్డికి మద్దతుగా ఓ వర్గం, వ్యతిరేకంగా మరోవర్గం నాయకులు పరస్పరం అంతర్గతంగా కుమ్ములాటలకు దిగుతున్నారు. రెండువర్గాలు ఎవరికి వారే పార్టీలో పైచేయి కోసం పోటీపడుతున్నారు. ఎంపీ ఎన్నికలకు ముందు పార్టీలో గ్రూపు తగాదాలు పెరుగుతుండటం ఆ పార్టీ అధిష్టానానికి తలనొప్పిగా మారింది. ఈ నేపథ్యంలో సంగారెడ్డి జిల్లాలో పార్టీ వ్యవహారాలను చక్కదిద్దే బాధ్యత రాష్ట్ర స్థాయిలో ముఖ్యనాయకుడికి అప్పగించినట్లు సమాచారం. సదరు నేత త్వరలోనే జిల్లాలోని నాయకులతో సమావేశం కానున్నట్లు తెలుస్తోంది.



భూమిపూజ చేస్తున్న మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

## మల్లన్న భక్తుల ఆకాంక్ష నెరవేర్చాం

- త్వరలోనే రైల్వేస్టేషన్ నిర్మాణం పూర్తి చేస్తాం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్
- కొమురవెల్లి మల్లన్నకు ప్రత్యేక పూజలు
- రైల్వేస్టేషన్ నిర్మాణ పనులకు భూమి పూజ
- కేంద్రం రూ.100 కోట్లు కేటాయించాలని వినతి

చేర్యాల, ఫిబ్రవరి 15: కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో రైల్వేలకు నిధులు కేటాయింపు విషయంలో తీవ్ర అన్యాయం జరిగిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. గురువారం కొమురవెల్లి మల్లికార్జున స్వామిని మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్, రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్‌తో కలిసి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పట్నం వేసి మొక్కులు చెల్లించుకున్నారు. వీరికి ఆలయ ఈవో బాలాజీ, పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి ఆలయ అర్చకులతో కలిసి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం రైల్వే స్టేషన్ నిర్మించనున్న ప్రాంతంలో మధ్యప్రదేశ్ సీఎం, దక్షిణ మధ్య రైల్వే మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ తదితరులతో కలిసి కిషన్‌రెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మల్లన్న భక్తుల కోసం రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్ సహకారంతో రైల్వే స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామని, కొండ ప్రాంతంలో ఉండడంతో సాంకేతికంగా ఇబ్బందులున్నా ప్రధాని మోదీ ఆదేశాలతో భక్తుల ఆకాంక్ష మేరకు రైల్వేస్టేషన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రధాని మోదీ స్వయంగా మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వేలైన్ ప్రారంభించారని తెలిపారు. తెలంగాణకు రైల్వే కేటాయింపుల్లో కాంగ్రెస్ సర్కారు 2014లో రూ.250 కోట్లు ప్రకటిస్తే, నేడు ప్రధాని మోదీ రూ. 6,000 కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి మోదీ ప్రభుత్వం రూ.26వేల కోట్ల నిధులు మంజూరు చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం ఎంత త్వరగా భూమి సేకరిస్తే నిధులు అంత త్వరగా వస్తాయన్నారు. త్రిపుల్ ఆర్ నిర్మాణం పూర్తి కాగానే, దాని చుట్టూ రింగ్ రైల్వేలైన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

### భారత్ రైల్వేలో సమూల మార్పులు
### మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్

ప్రధాని మోదీ నేతృత్వంలో భారతీయ రైల్వేలో సమూల మార్పులు చోటు చేసుకున్నాయని, బుల్లెట్ రైల్, వందేభారత్ వంటి అధునాతన రైళ్లు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయన్నారు.యావత్తు దేశాన్ని రైల్వే వ్యవస్థ ఒక్కటిగా చేస్తుందని, చైనా సరిహద్దు వరకు రైల్వేలైన్ విస్తరణ జరిగిందన్నారు. వీలైనంత త్వరగా కొమురవెల్లి మల్లన్న రైల్వేస్టేషన్ నిర్మాణం పూర్తవుతుందన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణశర్మ పాల్గొన్నారు.

### రూ.100కోట్లు కేటాయించాలని వినతి పత్రం

కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.100కోట్ల నిధులు మంజూరు చేయించాలని కోరుతూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్‌లకు ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, నాయకుడు మహాదేవుని శ్రీనివాస్, కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు.



మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న చైర్మన్

## వెటర్నరీ కాలేజీ తరలిస్తే ఉద్యమమే

- సిద్దిపేట ప్రాంత విద్యార్థులకు అన్యాయం చేస్తే సహించం
- కొడంగల్‌కు కొత్త కళాశాల మంజూరు చేసుకోండి
- ఇదేనా కాంగ్రెస్ మార్పు అంటే?
- సీఎం రేవంత్‌రెడ్డిపై మండిపడ్డ బీఆర్ఎస్ యువజన, విద్యార్థి విభాగం నాయకులు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ యువజన, విద్యార్థి విభాగం నాయకులు

సిద్దిపేట, ఫిబ్రవరి 15: సిద్దిపేటలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు వెటర్నరీ కళాశాలను మంజూరు చేస్తే దానిని కొడంగల్‌కు తరలించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చూస్తున్నారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్ఎస్ యువజన, విద్యార్థి విభాగం నాయకులు పేర్కొన్నారు. గురువారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సిద్దిపేటలో ప్రజలు, పంటలు, పశువుల కోసం వైద్యులను తయారు చేసే విద్యాలయాలను ఏర్పాటు చేసుకున్నామని, ఇక్కడి విద్యార్థుల కలలను నిజం చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆశయాన్ని కాలరాసేందుకు కాంగ్రెస్ కుట్రలు పన్నిందని ఆరోపించారు. అందులో భాగంగా సిద్దిపేటకు మంజూరైన వెటర్నరీ కళాశాలను కొడంగల్‌కు తరలిస్తున్నారని, ఇది ఈ ప్రాంతానికి కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అన్యాయమేనని మండిపడ్డారు. మెడికల్ కళాశాల, అగ్రికల్చర్ కళాశాలకు లేని అడ్డంకి వెటర్నరీ కాలేజీకి ఎందుకు వచ్చిందన్నారు. అవసరమైతే కొత్తగా మంజూరు చేసుకోవాలని సూచించారు. సిద్దిపేటకు మంజూరైన కళాశాలను తరలిస్తే ఊరుకునేది లేదని, ఉద్యమం తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యువజన విద్యార్థి విభాగం సీనియర్ నాయకుడు మెరుగు మహేశ్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు యాదగిరి ముదిరాజ్, యువజన, విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రజనీకాంత్ రెడ్డి, శ్యామ్ యాదవ్, పట్టణ యువజన, విద్యార్థి విభాగం అధ్యక్షులు రెడ్డి ప్రభాకర్ రెడ్డి, మహిపాల్ గౌడ్, పట్టణ సమన్వయకర్త ఇరుగంటి రమేశ్, యువజన విద్యార్థి విభాగం నాయకులు బెల్లంకొండ వెంకట్, రాగరం రాము, సాయి చరణ్ గౌడ్, బత్తిని శ్రీను, ఎర్రోళ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

## తండాల అభివృద్ధికి కృషి

- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- హుస్నాబాద్‌లో ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, ఫిబ్రవరి 15: హుస్నాబాద్ ప్రాంతంలోని గిరిజన తండాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం పట్టణంలోని యేనెపై గల బంజారా భవన్‌లో గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతిని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి సేవాలాల్, అమ్మవార్ల చిత్రపటాల వద్ద పూజలు చేశారు. భోగ్‌భాండార్‌లో భాగంగా జరిగిన హోమం, గోపూజ కార్యక్రమాల్లో పాల్గొని గిరిజనులతో కలిసి నృత్యాలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బంజారాలు సామాజికంగా, ఆర్థికంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. నిర్మాణంలో ఉన్న బంజారా భవన్‌కు నిధులు కేటాయించి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.గిరిజన తండాల పరిస్థితి, అక్కడ జరగాల్సిన అభివృద్ధి, కల్పించాల్సిన సౌకర్యాలపై ఇప్పటికే అధికారులతో సమీక్ష నిర్వహించామన్నారు. సమావేశంలో ఆర్డీవో బెన్ షాలోమ్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, ఎంపీపీలు లకావత్ మానస, మాలోతు లక్ష్మి, కౌన్సిలర్లు, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, గిరిజన సంఘాల నాయకులు, మహిళలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

### హాఫ్ మారథాన్ పోస్టర్ ఆవిష్కరణ

హుస్నాబాద్ రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మార్చి 10న నిర్వహించనున్న హాఫ్ మారథాన్ (21కి.మీ.ల పరుగు పందెం) పోస్టర్‌ను రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. యువకులు, ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## కనుల పండువగా డోలారోహణం

- శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం
- భక్తులతో కిక్కిరిసిన పంచవటీ క్షేత్రం
- వివిధ ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు
- నేడు రథసప్తమి వేడుకలు



పంచవటీ క్షేత్ర ఆవరణలో సరస్వతీదేవి డోలారోహణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

న్యాల్‌కల్, ఫిబ్రవరి 15: రాఘవాపూర్ గ్రామ శివారులోని సిద్ధి సరస్వతీదేవి పంచవటీ క్షేత్రం భక్తులతో సందడిగా మారింది. వసంత పంచమి వేడుకల్లో భాగంగా రెండో రోజు గురువారం క్షేత్ర పీఠాధిపతి కాశీనాథ్ బాబా ఆధ్వర్యంలో సరస్వతీదేవికి అభిషేకం, కుంకుమార్చన, సరస్వతీ యాగం, హారతి తదితర పూజలను వేదపండితులు ఘనంగా నిర్వహించారు. అనంతరం సరస్వతీదేవి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఊరేగించారు. ప్రధాన అర్చకుడు అయ్యప్పస్వామి ఆధ్వర్యంలో అర్చకుల వేదమంత్రోచ్ఛారణలు, మహిళల పాటలు, భజన కీర్తనల మధ్య డోలారోహణం, భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పవిత్రమైన మంజీరా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గంగామాత, సరస్వతీ అమ్మవారితో పాటు సూర్యభగవాన్, సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. పంచవటీ క్షేత్రంలో శుక్రవారం నిర్వహించే రథసప్తమి వేడుకలకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. సూర్యభగవాన్ స్వామి చిత్రపటాన్ని రథంపై ఏర్పాటు చేసి ఊరేగించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సరస్వతీదేవి, సూర్యభగవానుడి కృపకు పాత్రులు కావాలని పంచవటీ క్షేత్ర పీఠాధిపతి కాశీనాథ్ బాబా కోరారు.

## పరిశ్రమల్లో నిబంధనలు పాటించాలి



పాశమైలాంలోని ఓ పరిశ్రమను తనిఖీ చేస్తున్న కలెక్టర్

- ఫైర్ సేఫ్టీ విషయంలో రాజీపడేది లేదు
- కాలుష్యాన్ని నియంత్రించాలి
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి
- పాశమైలారం పారిశ్రామిక వాడలో ఆకస్మిక తనిఖీలు

పటాన్‌చెరు, ఫిబ్రవరి 15: సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి పరిశ్రమలను ఆకస్మిక తనిఖీ చేసి హడలెత్తించారు. వరుస తనిఖీలతో పారిశ్రామికవాడలోని రెడ్ కేటగిరి పరిశ్రమల యాజమాన్యాలు పరుగులు పెట్టాయి. ఫైర్‌సేఫ్టీపై కలెక్టర్ తనిఖీలు చేయడంతో అనేక పరిశ్రమల్లోని లోపాలు స్పష్టంగా కనిపించాయి. గురువారం పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలో కలెక్టర్ వల్లూరు క్రాంతి పర్యటించారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు కాలిపోయిన సీఎంహెచ్ పరిశ్రమను, దాంతో పాటు వనమాలి పరిశ్రమను పరిశీలించి ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. సమగ్ర విచారణ చేసి నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని స్పష్టం చేశారు. అనంతరం ఎస్పీ రూపేశ్, పీసీబీ, పరిశ్రమల భద్రత, కార్మికశాఖ జిల్లా అధికారులతో కలిసి పలు పరిశ్రమలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం జిల్లా అధికారులతో ఐలా సమావేశమందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాశమైలారం పారిశ్రామికవాడలో రెండు రోజుల క్రితం జరిగిన అగ్నిప్రమాదం ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి నివేదికను అందజేయాలని మంత్రి ఆదేశించారన్నారు. జిల్లా అధికారులతో జరిపిన తనిఖీల్లో అనేక భద్రతా లోపాలున్నాయని, కొన్ని పరిశ్రమలు నిబంధనలు పాటించడం లేదని గుర్తించామన్నారు. ఆలాంటి పరిశ్రమలపై చర్యలు తీసుకోకపోవడంపై కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తినష్టం జరుగుతుండటంపై విచారం వ్యక్తం చేశారు. టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసుకుని ప్రమాదాల నివారణకు కృషి చేద్దామని సూచించారు.

నిబంధనలను మరిచి పలు పరిశ్రమలు వ్యర్థాలను చెరువుల్లోకి వదులుతుండటంపై పీసీబీ అధికారులను ప్రశ్నించారు. పర్యావరణ సంరక్షణకు కృషి చేయాలని, ఇక మీదట వ్యర్థాలు కనిపిస్తే సంబంధిత పరిశ్రమలపై చర్యలుంటాయని హెచ్చరించారు. తాజాగా జరిగిన అగ్ని ప్రమాదం ఘటనలో రెండో రోజు మృతదేహాన్ని గుర్తించడంపై లేబర్ ఆఫీసర్‌ను నిలదీశారు. నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినందుకు కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక మీదట అన్ని శాఖల అధికారులు పరిశ్రమలను నిరంతరం తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెద్ద సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, ప్రమాద రహిత పారిశ్రామికవాడలను ప్రోత్సహిద్దామన్నారు. కాలుష్యంపై గట్టి నజర్ పెడతామని, టాస్క్‌ఫోర్స్ ద్వారా భద్రత పెంచుతామన్నారు. ప్రమాదాలు జరగకుండా ప్రణాళిక అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మూడు పరిశ్రమలు మూసివేత

#### కలెక్టర్ ఆదేశాలతో సీజ్ చేసిన అధికారులు

పటాన్‌చెరు, ఫిబ్రవరి 15: భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించిన మూడు పరిశ్రమలపై కలెక్టర్ వల్లూరు క్రాంతి కొరడా ఝుళిపించారు. పాశమైలారం పారిశ్రామికవాడలో సాల్యూబ్రియస్ లెబొరేటరీస్, వైటల్ సింథటిక్స్, వెంకర్ కెమికల్స్ పరిశ్రమల్లోను భద్రతా ప్రమాణాలు లేవని గుర్తించి, పరిశ్రమల మూసివేయాలని అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆర్డీవో రవీందర్‌రెడ్డి, పీసీబీ, కార్మిక శాఖ, పరిశ్రమల భద్రతా శాఖ అధికారుల బృందం మూడు పరిశ్రమలను సీజ్ చేశారు. మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించిన పరిశ్రమలపై కేసులు నమోదు చేశారు.